# అవుట్ సోర్సింగ్

ఆదివారమన్నా కాస్త రెస్టు తీసుకోకుండా ఊరంతా తిరిగి తిరిగి వాకిట్లో అడుగు పెట్టానో లేదో మా పెద్ద మనిషి ఎదురై -

"ఇదుగో! నువ్వు ఇంట్లో ఉండనప్పుడు మన ఫోన్ నెంబరెందుకిస్తా వందరికీనూ. కట్ చేయించేసెయ్ వెధవ ఫోను. నాకు ఇంట్లో ఉండీ కూడా క్షణం విశ్రాంతి లేకుండా అయిపోయింది" అని విసుక్కున్నారు.

"నేనున్నానో లేదో ఫోన్ చేసే వాళ్ళకెలా తెలుస్తుంది? అయినా మనకి ఫోన్ ఇప్పుడొచ్చిందా. అందర్నీ కేకేసి నేను నంబరిచ్చేందుకు. ముప్పై ఏళ్ళనించీ ఇదే నేను, ఇదే ఇల్లు, ఇదే ఫోను. ఇదివరకు ఆరు నంబర్లు. వాటి ముందిప్పుడు ఇంకో రెండు తగల్చడమేగా. మన నెంబరు ఎవరికి తెలియదని. అసలింతకీ ఏవిటంత ముఖ్య సమాచారం? నేను కనబడగానే విసుక్కోవడం తప్ప కాస్త మంచిగా చెప్పలేరూ?"

"ఫోను లక్ష్మి దగ్గర్నించి. మూడుసార్లు చేసింది. రేపు మీ అందరికీ మినర్వాలో డిన్నరట. వాళ్ళబ్బాయి అమెరికా వెళ్ళిపోతున్నాడట. ఇంటిల్లిపాదినీ రమ్మని మరీ మరీ చెప్పింది."

"హోటలు భోజనాలు చేయడం ఇంక నా వల్ల కాదు. చచ్చిపోతున్నాం. ఒక్క మహాతల్లి కూడా నాలుగు మెతుకులొండి చారేసి అన్నం పెట్టలేకపోతోంది. చివరికి తద్దినం కూడా క్యాటరింగ్ వాడికే" అని నాకిష్టం లేనట్లు మాట్లాడాను మా ఆయన్ని సంతోషపెట్టేందుకు.

"నీకిష్టం లేకపోతే మానెయ్. ఊరెళ్ళావని చెప్తాలే. కాకపోతే కొడుకు అమెరికా వెళ్ళనందుకుగానూ ఉడుక్కున్నావనుకుంటారు."

మీరు కాసేపు మాట్లాడకండి. చిరాకొచ్చేస్తోంది. మనవాడు అమెరికా వెళ్ళకపోడానికి కారణం అవకాశాలు రాక కాదని చెప్పి అందర్నీ ఒప్పించలేక నా తల ప్రాణం తోక్కొస్తోంది.

"ప్రాణం జాగ్రత్త" అంటూ వెళ్ళి పోయారు. ఓహో! ఇంక లక్ష్మి కడసారి కంది గింజగాడ్ని కూడా ఆ భూతల స్వర్గానికి పంపేస్తోందన్న మాట. ఇంక మొగుడూ పెళ్ళాలిద్దరూ చిలకా గోరింకల్లాగా స్కూటరేసుకు తిరగొచ్చు. గరిట్లో హల్వా చేసుకుని దాంట్లోంచే చెరో కాస్తా నోట్లో పడేసుకోవచ్చు. ఆర్నెల్లు ఇండియాలో ఆర్నెల్లమెరికాలో ఎంజాయ్ చేయచ్చు.

ఇక్కడి పెళ్ళిళ్ళక్కడికి అక్కడి పుట్టిన రోజు లిక్కడికి కాసెట్లల్లో ప్రయాణం చేయచ్చు. అసలిదివరకు మన ఊరెలా ఉండేది? ఎక్కడ చూసినా పిల్లలే! టెన్త్ చదివే వాళ్ళూ, ఎంట్రన్సులకు చదివేవాళ్ళు, ఇంజనీరింగులూ డాక్టరీలు చదివేవాళ్ళ పరీక్షలూ, ఎంట్రన్సులూ, ట్యూషన్లూ. అందరు పిల్లలకీ ఒకటే లోకం. పరీక్షలు, పరీక్షలవగానే మళ్ళీ పరీక్షలు, ఇంకో పరీక్షలు. ఇవన్నీ రాసి రాసి పాసై పాసై పిల్లలంతా ఏమైపోయారు? ఎక్కడికి పోయారు? మన హైదరాబాద్ రైతులొదిలేసిన ఊరయిపోదుకదా. సినిమాకెళ్ళినా, గుడికెళ్ళినా చివరికి శిల్పారామం వెళ్ళినా కనిపించేది వయసు మళ్ళిన జంటలే! పసిపిల్లలు ఏరీ ఏమయిపోతున్నారు? చిన్న జంటలు మన వాళ్ళిళ్ళల్లో ఏ పండగకి గాని పెళ్ళిళ్ళకి గానీ కనిపించడమే లేదు. మనలాటి వాళ్ళంతా తినడం తిరగడం. ఆరోగ్యం కాపాడుకోడానికి యోగా చేస్తుండడం. ఆరోగ్యం బాగానే ఉంది ఢోకాలేదని ధైర్యం తెచ్చుకోడం కోసం టెస్టులు చేయించుకోడమూ. ఆరోగ్యం చూసుకోవడం ముఖ్యం కాదని మెడకాయ మీద తలకాయ ఉన్న వాడెవడూ అనడు. కాకపోతే ఈ ఢోకాలేని ఆరోగ్యమైన శరీరాలతో, ఏం చెయ్యాలో ఎవరికీ తెలియదు. ఎటువంటి పరోపకార చింతనా లేకుండా బతికే మనుషులున్న ఈ సమాజంలో ఎవరైనా ఏ వ్యాపకం చేపట్టగలరు? మా చిన్నప్పుడు కొందరిళ్ళల్లో చూస్తుండేదాన్ని. స్టీలు డబ్బాలు తోమి తోమి బట్టపెట్టి రోజూ శుభ్రంగా తుడిచి బోర్లించే వాళ్ళు. హాల్లో కూర్చున్న అతిథులకి అవి వంటింట్లో మెరుస్తూ కనిపించేవి. వంటలో వాడుకునే వెచ్చాలన్నీ పాత డబ్బాల్లో ఏ మూలో ఉండేవి. ఈ శరీరాలని చూస్తే నాకా స్టీలు డబ్బాలు గుర్తొస్తున్నాయి. ఏ గాంధీ అన్నా మళ్ళీ పుట్టి మనమంతా ఏం చెయ్యాలో చెప్తే బాగుణ్ను. స్వతంత్రం కోసం పోరాడేందుకు లేదు. పోనీ ఇంగ్లీషు వాళ్ళనే మళ్ళీ రమ్మని పోరాటం చేద్దామా? అయినా అది కూడా ఒక రకంగా అవుతూనే ఉంది కదా! మూడొంద లేళ్ళ క్రితం కమ్యూనికేషన్స్ అభివృద్ధి చెందలేదు కాబట్టి ఫ్రెంచి వాళ్ళూ ఇంగ్లీషు వాళ్ళూ నానా అవస్థలూ పడుతూ పడవల్లో ప్రయాణం చేసి వచ్చి మనల్ని పాలించలేక వాళ్ళ చావు వాళ్ళు చచ్చేవాళ్ళు. ఇప్పుడెవరూ అంత కష్టపడకుండానే పన్లయిపోతున్నాయి.

అయినా వాళ్ళిదివరకు వ్యాపారాభివృద్ధికోసమే కదా మన దేశం వచ్చింది? ఇప్పుడు కూచున్న చోట నుంచి కదలక్కర్లేకుండానే మన దేశం నిండా సీమ సరుకులే. చింతపండు నుంచి తాళం కప్పదాకా, పెన్సిళ్ళ దగ్గరనుంచీ కంప్యూటర్ల దాకా అన్నీ సగం ధరకే దొరుకుతున్నాయి. కాకపోతే పెద్ద పెద్ద ఫ్యాక్టరీలన్నీ

మూసేస్తుండటంతో మన మగాళ్ళంతా వి‌ఆర్‌ఎస్‌లు తీసుకుని వంటింట్లో మన వెనకాలే తిరుగుతుండటం చేతనున్నూ, పిల్లలంతా రెక్కలు తగుల్చుకుని సీమలను బాగు చేసేందుకు ఎగిరిపోవడం చేతనున్నూ, మనకి ఆ సగం ధర పెట్టి కొనే స్థోమత కూడా లేదన్నది వేరే విషయం. ఇంకోపని చెయ్యవచ్చు. సీమ సరుకులు ఎలాగూ క్రెడిట్‌కివ్వరు గాబట్టి, మన వి‌ఆర్‌ఎస్‌లో వచ్చిన డబ్బులకి బ్యాంకు వడ్డీ గిట్టుబాటవట్లేదు కాబట్టి, ఆ డబ్బుల్తో ఆ సరుకులు కొని వాయిదాల పద్ధతి మీద మన వాళ్ళకమ్మితే ట్రేడింగ్ చేసినట్లుంటుంది. మనకి కాస్త కాలక్షేపం అవుతుంది. పరిచయాలు కూడా పెరుగుతాయి.

అయినా మన పిల్లలు అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదించడం ఒక రకంగా చూస్తే మన దేశంలో తల్లులు సాధించిన ఘనవిజయమే (డ్వాక్రా మహిళల్లాగా అన్నమాట). ఆ ముక్క హిల్లరీ క్లింటన్ కూడా ఒప్పుకుంది. కానీ అక్కడికి వెళ్ళిన పిల్లలు కాస్త తిరిగి చూస్తే కదా సర్క్యూట్ పూర్తయేది. వెళ్ళగానే కారూ ఓ ఇల్లూ కొనేసుకుని డబ్బుల్లేవో అని గోలపెట్టడం! వాళ్ళ జీవితమంతా ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడం. మరి వీళ్ళు కట్టు బానిసలవరా? కాకపోతే రేటెక్కువ అంతే తేడా. అలా చేయడంలోనే ఉంది తెల్లవాడి తెలివి మరి. మా చిన్నప్పుడు తినీ తినకా కూడా ఇంటికింత పంపేవాళ్ళం.

“ఏవండీ! మాట.”

“మళ్ళీ ఏం గుర్తొచ్చింది?”

“అది కాదూ. మనం బెంగళూరులో ఉన్నప్పుడు మనిద్దరికీ కలిపి ఎనిమిది వందలొచ్చేది కదా. ఇంటికెంత పంపేవాళ్ళం?”

“నూటయాభై. అయినా నలభై ఏళ్ళనాటి సంగతి ఇప్పుడెందుకూ? నువ్వెవ్వరికీ పంపక్కర్లేదుగా.”

“నే బతికున్నన్నాళ్ళూ ఎవరో ఒకరికి పంపడమేనేవిటి. మరీ! ఇప్పుడు ఇద్దరూ ఇంతింత సంపాయిస్తూ కూడా నిక్కీ నీలిగీ నెలకి రెండు వందలు పంపి అంత ఖర్చైందుకైందని ఎకౌంటడుగుతారేవిటి?”

“నిజంగానే వాళ్ళు డబ్బు విషయంలో అంత జాగ్రత్తగా ఉంటారు కాబట్టి. నీకా సమస్యలేం లేవుగా ఇంకోళ్ళ ఊసు నీకెందుకు?

“అందరూ మనకెందుకులే అని ఊరుకోబట్టే మనం అంతా ఇలా ఉన్నాం. మన దేశమూ తగ్గట్టే ఉంది. అమెరికాలో ఉన్న మన వాళ్ళ పిల్లలొక్కోళ్ళు వాళ్ళ ఇంటికి నెలకి కనీసం అయిదు వందల డాలర్లయినా పంపిస్తే మన

ఇండియా ఎకానమీ ఎంతమారిపోతుందీ? అందరం ఎంత హాయిగా బతకచ్చు. డిస్కౌంటులో ఎన్ని టెస్టులు చేయించుకోవచ్చు? మన హోటలిండస్ట్రీ, టూరిజం ఇండస్ట్రీ, హాస్పిటల్ ఇండస్ట్రీల లాంటివి ఎంత బాగుపడిపోతాయ్! ఎంత నిరుద్యోగ సమస్య తీరిపోతుంది? ఎన్ని ఫైవ్-స్టార్ ఓల్డ్ ఏజ్ హాస్టల్స్ పెట్టుకోవచ్చు. ప్రస్తుతం ఎంసెట్ కోచింగ్ సెంటర్లకి డిమాండ్ తగ్గేలా ఉంది. ఈ లైన్ బాగుంటుంది కదా. నాకు తెలియకడుగుతానూ, ఈ పిల్లకాకులని బతిమాలేదేవిటి? అసలు మన ఇండియా పాస్‌పోర్టు ఉంచుకునేందుకు సంవత్సరానికి వెయ్యి డాలర్లు మన దేశానికి కట్టమనాలి. అలా చేసినా మన దేశానికి బోల్డు డబ్బు వస్తుంది వింటున్నారా?"

"అమ్మా తల్లీ! నీకెవరూ ఫైనాన్స్ పోర్టుఫోలియో ఇవ్వరు గానీ అనవసరంగా రొప్పు పడకు. ఆ తంటాలన్నీ పడడానికి పెద్దవాళ్ళు చాలామందున్నారు. కౌసల్య బట్టలు తెచ్చి ఇందాకట్నించీ నిలబడుంది. దాని సంగతేవిటో చూడు."

అంత మర్యాదగా "యు ఆర్ డిస్‌మిస్డ్" అని మా ఆయన డిక్లేర్ చేశాక ఇంకా అక్కడ వేళ్ళాడుతూ అవాకులు చెవాకులు మాట్లాడి ఆ పైన విందుభోజనం చేయడం ఎందుకులే అని బయటకి వచ్చి పద్దు చూడ్డం మొదలుపెట్టాను. నేను కాస్త మాట్లాడే మూడులో ఉంటే ఎలా తెలిసిపోతుందో అవతలివాళ్ళకి! నే నోరిప్పకుండానే కొత్త సబ్జెక్టు ఓపెన్ చేసింది కౌసల్య...

"అమ్మా! మన పాపమ్మేడుందమ్మా?"

"దాన్ని అందరం అమెరికా పాపమ్మంటాంగదా. తెలియనట్లు కొత్తగా అడుగుతావేం?"

"అక్కడ్నే... ఏ ఊళ్ళో ఉందమ్మా?"

"ఎక్కడోలే. నీకెందుకూ? నువ్వేమన్నా పోతున్నావా?"

"నే బోనుగానీ..."

"మీ ఆయన పోతాడా? పంపేయ్. ఇల్లూ పెళ్ళాం అంటే ఏంటో తెలిసొస్తుంది."

"నే అమ్మా! పిలగాడు పోతనంటున్నడు. ఒక్క లక్ష మనం కర్సుపెడితే ఒకాయన పంపిస్తనంటున్నడు. ముంగల మన రేసను కార్డుమంటిది తెప్పియ్య మంటుండు. పొద్దుమింకి సురేశ్‌ను తోలిపెస్త. జర ఆనికి కాయితాలు నింపనీకి చూపియ్యి. పైసల సంగతి మా ఇంటాయనతో అనేవు" అని బట్టలప్పచెప్పి మళ్ళీ మూటెత్తుకుని వెళ్ళిపోయింది. అయితే ఇప్పుడు దీని కొడుక్కూడా

అమెరికా వెళ్ళిపోతాడా ఏం గోల! ఛ! దుబాయయితే అర్థం చేసుకోవచ్చు. అయినా వాడెక్కడికి పోతే నాకెందుకట. ఆ కాయితాలేవో నింపి పెడితే వాళ్ళ తంటాలు వాళ్ళు పడతారు. అసలు వాడి చదువుకోసం కౌసల్య బోల్డు ఖర్చు పెట్టింది గానీ మూడో ఎటెమ్ట్‌లో గానీ టెన్తు గట్టెక్కలేదు. వాడికి చదువచ్చి రావడంలేదని గ్రహించాక వాళ్ళమ్మ ఇంక డబ్బులివ్వడం మానేసింది. ఆ తరువాత వాడు అప్పుడప్పుడు తన స్నేహితులతో కలిసి మా వీధి చివరా, వినాయక చవితి చందాలప్పుడూ, అయ్యప్ప పూజల్లోనూ, ఓట్ల పండగలప్పుడూ కనిపిస్తుంటాడు. ఒంటరిగా అయితే ఎప్పుడూ ఉండడు. నన్ను చూడగానే ఎందుకో పారిపోతాడు. వాళ్ళ నాన్న తిట్టగా తిట్టగా రాత్రిళ్ళు అప్పుడప్పుడు కొన్ని బట్టల్నిస్త్రీ చేస్తాడని చెప్పి వాళ్ళమ్మ మురిసిపోతుంటుంది. నిజం చెప్పా లంటే మనలో చాలామందికన్నా వాళ్ళ ఆర్థిక పరిస్థితి బాగుందని ఒప్పుకోక తప్పదు. మొగుడూ పెళ్ళాం కలిసి అయిదిళ్ళల్లో బట్టలుతికి ఇస్త్రీలు చేసి నందుకుగాను నెలకి నాలుగు వేలు, పైన పాడిస్త్రీలు చేసి కనీసం రెండు వేలు, యాభై వేలు నాలుగు రూపాయల వడ్డీకి తిప్పి రెండు వేలు, సొంతింట్లో వీళ్ళకు తోడుగా మూడు గదులద్దెకిచ్చినందుకు మూడు వేలు. ఇలా అన్నీ కలిపితే దరిదాపుగా పది పదకొండు వేలు నెల తిరిగేటప్పటికి కళ్ళచూస్తారు. ఆడపిల్ల ఎప్పుడో పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోయింది. ఉన్న ఈ ఒక్క బడుద్ధాయినీ అమెరికా పంపడం ఎందుకో! అయినా అక్కడ వాళ్ళకి వీడితో ఏం అవసరం పడిందబ్బా?...

ఇలాంటి వాళ్ళని కూడా అమెరికా వాళ్ళు రానిస్తున్నారంటే మరి ఇప్పటి వరకూ అక్కడ చేరిపోయి కాలరెగరేసుకునే వాళ్ళ పరువేం కావాలి? ఏవిటో నాకే అంతా అయోమయంగా ఉంది. నాకున్న గొడవలు చాలవన్నట్లు ఖమ్మం నించి మా వారి కజినొకడు ఫోను చేశాడు. "వదినా! నీతో పనుండి హైదరా బాదు వస్తున్నా. ఏం అనుకోవు కదా."

"అనుకోవ నికేం ఉందిలే! పని కాకపోతే నువ్వేమీ అనుకోకపోతే చాలు."

"నువ్వు తల్చుకుంటే కానంత పెద్దదేం కాదులే. నీకెవరైనా IPS వాళ్ళుగానీ, క్లాస్‌వన్ ఆఫీసర్లు గానీ తెలిస్తే ఓ అర్జంటు పని చెప్దామని."

"నాకెవరూ పెద్దగా తెలియదయ్యా బాబూ! మా అమ్మవేపు వాళ్ళొకళ్ళిద్దరు న్నారు గానీ నేను టచ్‌లో లేను. ఏనాడూ ఎవరినీ సాయం అడగలేదు. హాయిగా

డబ్బు పడేస్తే చేసి పెట్టేవాళ్ళు కోకొల్లలున్న మన దేశంలో నా బోటిగాళ్ళ రికమండేషనెందుకు?''

"ఇదేం కాని పని కాదొదినా. మా వాడికి అర్జంటుగా పాస్‌పోర్టు కావాలి తత్కాల్ అని ఉందిట కదా. త్వరగా రావాలంటే పెద్ద ఆఫీసర్ల సంతకం పెట్టాలట. అనుకోకుండా అమెరికా ఛాన్సు వచ్చింది. వీడ్ని కూడా పంపేస్తే ఇంక మాకు దిగుళ్ళుండవు. ఏవిటి మరి రమ్మంటావా?''

"సరే రండ''ని ఫోను పెట్టేశాను. వీడు ఇంటరు పాసయ్యేటప్పటికే పెద్దలు దిగి వచ్చారు. అలాటిది వీడిక్కూడా అమెరికా ఛాన్సా? ఏవిటి ఎక్కడో ఏదో విపరీతం జరుగుతోంది. సాయంత్రం కూర్చుని నేనూ సురేశు ఫారం నింపడం మొదలుపెట్టాము. సురేశ్ వచ్చింది మా ఇంటికే అయినా ఏదో ఆఫీసుకొచ్చినంత నీటుగా సూటూ బూటుతో ముస్తాబై వచ్చాడు. ఇలా మొదలెట్టామో లేదో సుడిగాలిలా వచ్చి పడ్డాడు మా మరిది వాళ్ళ పుత్రరత్నంతో సహా. అతనికి హడావిడి ఎక్కువ. నా చేతిలో ఫారం చూస్తూనే "అప్పుడే తెప్పించేశావా వదినా! నా దగ్గిర నింపిందే ఉందిగా'' అంటూ.

"అబ్బే! ఇది ఈ అబ్బాయిదిలే. ఇతను మన కౌసల్య కొడుకు'' అని చెప్పి "ఒక్క గంట ఆగిరా సురేష్'' అన్నా.

"పొద్దున్నే వస్తానమ్మా'' అని వాడు మాయమైపోయాడు.

"ఈ అబ్బాయీ అమెరికా వెడుతున్నాడా? ఏం చదువుకున్నాడేవిటి?'' అనడిగాడు.

"టెన్త్ పాసయ్యాడు. ఎక్కడికి ఎందుకెడుతున్నాడో నేను అడగనే లేదు. ఇదంతా పాస్‌పోర్టు కోసమేలే. అవునూ! మరి మీవాడికెలా వచ్చిందీ ఛాన్సూ?''

"అంటే మా అల్లుడు పంపాడులే. పిన్ని ఏం చేస్తోంది? పలకరించి వస్తా'' అంటూ హడావిడిగా ఎవరో తరుముతున్నట్లు మా అత్తగారి గదిలోకి వెళ్ళిపోయాడు.

అతను వివరం చెప్పదల్చుకోలేదని గ్రహించలేనంతటి మొద్దునా నేను. ఇంక మళ్ళీ నేను ఆ విషయం ఎత్తనే లేదు. ఇంతమంది పాస్‌పోర్టుల కోసం నానాహైరానా పడుతున్నారు. మన దేశ పౌరులుగా పుట్టడం అంత గర్వకారణమా! అది చూసే ఎవరన్నా మెచ్చి మేకతోలు కప్పేస్తారా? నా గదిలో కూచుని పేపరు తిరగేస్తుంటే నా అనుమానం రెట్టింపయింది. మామూలుగా అయితే మన హైదరాబాద్ పాస్‌పోర్టు ఆఫీసు వాళ్ళు నెలకి వెయ్యి పాస్‌పోర్టు

లిస్తారట. కానీ గడిచిన వారం పది రోజుల్లో రెండు లక్షల అప్లికేషన్లు వచ్చాయట. అందులో చాలామంది తత్కాల్ స్కీములో త్వరగా వెళ్ళిపోవాలనే వాళ్ళే. వాటిని ప్రాసెస్ చేసేందుకు వ్యవధి పడుతుందని, ఆ ఆఫీసు అఫీషియల్‌గా ప్రకటించి బొంబాయి, మద్రాసు, బెంగుళూరు, ఢిల్లీలలో కూడా ఇంచుమించు ఇలాంటి పరిస్థితి కనబడ్డంతో తక్షణ చర్యలు తీసుకుని కొందరిని డిప్యుటేషన్ మీద ఆ శాఖకు బదిలీ చేస్తారని కూడా ప్రకటించింది.

టివి చూడబోతే ఏదో ఒక నేషనల్ ఛానల్ వాళ్ళు వందమంది ప్రేక్షకులతో కలిపి చర్చ లాంటిది నిర్వహిస్తున్నారు. వాళ్ళ మధ్యలో ఒకాయన మైకు చేతిలో పట్టుకుని కథాకళి చేస్తున్నాడు. ఇంతకీ సబ్జెక్టేవిటయ్యా అంటే అమెరికా అంత పని చెయ్యవచ్చునా అని. చెయ్యకూడదని కొందరంటున్నారు. చేస్తే తప్పేమిటని కొందరంటున్నారు. కొత్తగా అమెరికా చేసిన అఘాయిత్యం ఏముందబ్బా! ఇరాక్‌కి స్వతంత్రం ఇప్పించేసింది కదా మిన్ను విరిగి మీదపడ్డా చలించని మన జనాలు అమెరికా అనేటప్పటికి ఇంతగా రియాక్టయిపోతున్నారు. సరిగ్గా చూద్దామనుకునేటప్పటికి మా కేబుల్ వాడి కరెంటు పోవడంతో దూరదర్శన్ చూస్తూ ఉండిపోయా.

మర్నాడు పొద్దున సురేశ్‌గాడ్ని కూలేసి విషయం కొంత తెలుసుకున్నాక రాత్రి జరిగిన టివి ప్రోగ్రాంతో, పేపరులో చదివిన వార్తలనీ, నా సొంత తెలివినీ కూడా కలిపితే మొత్తం నాకర్థమయింది. అమెరికా వాళ్ళు మన దేశంలో కొందరు ప్రబుద్ధులకి వీసాలు జారీ చేస్తున్నారట. ఎక్కడో ఒకటీ రెండు చోట్ల చిన్నగా వార్త రావడం ఆ నోటా ఈ నోటా తెలిసి వెళ్ళడమేగానీ ఎక్కడా పేపర్లో ఎడ్వర్టయిజ్‌మెంటు లాంటిది ఏమీ లేదుట. కాని తగినంత మంది కన్సల్టెంట్లు పుట్టుకుని వచ్చి కేవలం తల ఒక్కింటికి లక్ష రూపాయల ఫీజుతో మూడేళ్ళకి వీసా ఇప్పిస్తున్నారట. అర్హతలేమిటయ్యా అంటే ఇండియాలో పుట్టిన మగపిల్లవాడై ఉండాలి. 23-27 ఏళ్ళ మధ్య వయస్సులో ఉండాలి. టెన్తు పాసైతే చాలు. పెళ్ళయినా ఫరవాలేదు. అయిదడుగుల ఆరంగుళాలు పొడుగు, 50-60 కిలోల బరువూ ఉండాలి. కంటిచూపు బాగుండాలి. ఇంగ్లీషులో ఉన్న ఫారం స్వంతంగా నింపగలగాలి. ఆటలాడ్డం వస్తే మరీ మంచిది. వగైరా-వగైరాలు. ఇవన్నీ సర్టిఫై చేసేందుకు మనూళ్ళోనే అయిదు ప్రైవేటు హాస్పిటల్సుకి పర్మిషనిచ్చారట. వాళ్ళు రెండు వేల రూపాయలుచ్చుకుని సర్టిఫై చేస్తారుట.

ఈ కథంతా విన్నాక నాకనుమానం వచ్చింది. ఇదేవిటి మిలిటరీలో చేరేందుకు సరిపడే కండిషన్సులా ఉన్నాయని. మరి ఇన్నాళ్ళూ మన వాళ్ళకి వీసా కావాలంటే ఆస్తులుండాలనీ అడిగేవాళ్ళుగానీ ఇవన్నీ అడిగేవారు కాదు కదా. నా అనుమానం నిజమే. సురేశ్ చెప్పాడు. సెలక్టయి వీసా వస్తే విమానం ఎక్కే ముందే మూడు లక్షల రూపాయలు ఇస్తారుట. మూడేళ్ళ కాంట్రాక్టుట. అందులో వాళ్ళే ఆర్నెల్లు ట్రైనింగిస్తారుట. ఇక్కడ వాళ్ళమ్మా నాన్నలకి పది వేలు నెలకి బ్యాంకులో వేస్తారుట. ట్రైనింగ్ అయిపోయాక వాళ్ళే దేశంలో పనిచెప్తే అక్కడ పనిచేయాలిట. ఏ పని చెప్తే అది చెయ్యాలిట. మూడేళ్ళవగానే ఇండియాలో దిగబెట్టేస్తారుట. మళ్ళీ అప్పుడు అయిదు లక్షలిస్తారుట. ఎట్టి పరిస్థితులలోనూ మూడేళ్ళ కన్నా ఉండనివ్వరుట. ఒకవేళ ఏ ప్రమాదమన్నా అయి జరక్కూడనిది జరిగితే తల్లిదండ్రులకి పదిహేను లక్షలిస్తారుట. "అంటే మిలటరీయే కదురా. మీ అక్కకి మిలటరీ సంబంధం వస్తే చచ్చినా ఇవ్వనని మీ అమ్మ ఏడ్చి గోలపెట్టింది. ఇప్పుడు నిన్నెలా పంపిస్తుంది" అని అనడిగాను.

"మిలటరీ కాదమ్మా! యుద్ధం అయిపోయాక చేసే పన్లంటమ్మా. కొంచెం అవి కూడా నేర్పిస్తారుట గానీ మనల్ని ముందుగా యుద్ధంలోకి పంపరుట. భయం లేదని సారు చెప్పిండు" అన్నాడు.

దీన్నిబట్టి ఏతావాతా తేలిందేమిటంటే అమెరికా వంటి పెద్దలు ప్రపంచ ప్రజల సంక్షేమంకోరి కొంత పెత్తనం చేయబోయినప్పుడు అన్యాయంగా వాళ్ళ సైన్యం బలైపోతోందిట. అంత విలువైన అమెరికన్ ప్రాణాలు పోవచ్చునా? అసలే అక్కడి తల్లులు పిల్లల్ని కనడానికి అనేక అభ్యంతరాలున్నాయి గదా! "పరాయి దేశాల తగవులు తీర్చబోయి చచ్చేందుకే మేం పిల్లల్ని కంటున్నామా?" అని అక్కడ ఆడవాళ్ళు ఆందోళన చేస్తున్నారుట. ఒక అమెరికన్ డాలరు నలభై అయిదు రూపాయలకు సమానమనుకుందాం. మరి ప్రాణమంటే డబ్బెట్టి కొనగలిగేది కాదు కదా. అసలే జనసాంద్రత తక్కువున్న ఆ దేశపు ప్రాణంతో, జనాలతో లుకలుకలాడి పోతున్న మన దేశంలోని మనిషి ప్రాణం విలువని పోలిస్తే ఇంకో పది పెట్టి హెచ్చవేయాలి. అంటే ఒకళ్ళకి మనవాళ్ళు నాలుగొందలేభై మంది తూగుతారు. వాళ్ళు దీన్ని సైన్యం అనడం లేదు. 'దగ్ధమైన దేశాల పునర్నిర్మాణ దళం' అని పిలుస్తున్నారు.

మా చిన్నప్పుడు మా చుట్టాల్లో ఒకావిడ ఏడుగురు పిల్లలతల్లి ఉండేది. పిల్లల్ని పెంచలేక చదువులు చెప్పించలేక ఆవిడ అవస్థలు పడుతూంటే,

పిల్లలు లేని ఒక శ్రీమంతురాలు వాళ్ళకి సాయం చేస్తుండేది. ఆవిడ సమక్షంలో ఈ తల్లీ పిల్లలు ఎంతో తక్కువగా ఉన్నట్లనిపించేవారు. కాలక్రమాన ఆ పిల్ల లంతా పెద్దవాళ్ళయి వృద్ధిలోకొచ్చాక మళ్ళీ అదే సెటప్. ఒక పెళ్ళిలో చూసి 'ఔరా! ఇప్పుడెవరు శ్రీమంతులు? ఎవరు కాదు?" అని ఆశ్చర్యపడ్డాను. బహు సంతానవతి అయిన మన భరతమాత కూడా ఇప్పుడు శ్రీమంతురాలైపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇన్నాళ్ళూ మన దేశం నుంచి ఆణిముత్యాల్ని మాత్రమే రానిచ్చేవాళ్ళు. ఇప్పుడిలా సామాన్యుల్ని కూడా రానిస్తున్నారన్న మాట. దీనివల్ల ఎవరికొచ్చిన ఇబ్బందీ లేదు. కళ్ళముందు బడుద్దాయిలా తిరక్కుండా ఎంచక్కా పిల్లాడమె రికా చెప్పుచేతల్లో ఉంటాడు. చెప్పిన మాట వినడం, పొద్దున్నే లేవడం, వేళకి నిద్దరపోవడం, పెట్టిందేదో తగుమాత్రంగా తినడం లాంటివన్నీ నేర్పడమే కాకుండా, అప్పులు తీర్చుకునేందుకు ముందస్తుగా మూడు లక్షలూ, మధ్యలో డబ్బిబ్బందులు పడకుండా నెలకి పదివేలు, ఆనక కాలుమీద కాలేసుకుని కూర్చుని తినేందుకు అయిదు లక్షలు దొరుకుతాయంటే మాటలా. అదీగాక పిల్లాడు అమెరికా వెళ్ళొచ్చాడంటే (ఇంకా ఏయే దేశాలు తిప్పుతారో తెలియదు గానీ) బోల్డు కట్నాలు పలుకుతాయి.

అవన్నీ ప్రజలకి కలిగే లాభాలు. మరి మన ప్రభుత్వానికి వచ్చే లాభం ఏవిటీ? నిరుద్యోగ సమస్య దానంతట అదే తీరుతుంది. మన దేశపు యువ కులు వెళ్ళి ఎన్నో దేశాలని పునర్నిర్మించారన్న మంచి పేరు వస్తుంది. అసలవి ఎందుకు పునర్నిర్మించాల్సి వచ్చిందో ఎవరడుగుతారు? పైగా మన దేశానికి బోలెడు డాలర్లు కుప్పతెప్పలుగా వచ్చిపడిపోతాయి. దాంతో రూపాయి విలువ పెరిగిపోతుంది. ఒకసారి మొదలైందంటే ఇంక వెళ్ళే బ్యాచ్‌లు వెడుతుంటే వచ్చే బ్యాచ్‌లు వస్తుంటాయి. కాబట్టి ఆ విశ్వాసంతో వరల్డ్ బ్యాంకులింకా మనకి అప్పులిస్తాయి. ఆ డబ్బుల్తో మనం ఒక టౌన్ నుంచి ఇంకో టౌనుకి ఫ్లై ఓవర్లు కట్టే కార్యక్రమం పెట్టుకుని టెన్తు కూడా పాసవని లేబరుకి ఉపాధి కల్పించవచ్చు. ఆ ఫ్లై ఓవర్లు చూసి మళ్ళీ అన్ని దేశాల వాళ్ళూ ఇక్కడ ఇండ స్ట్రీలు పెడదామని రావచ్చు. మళ్ళీ ఉపాధి. తద్దినం భోజనంలా అంతా తల్చు కుంటేనే ఒళ్ళు పులకరించిపోతోంది. ఏమో? ఇలాగే కలిసొస్తే కొన్నాళ్ళకి మనకి ఉద్యోగాలెక్కువైపోయి మనుషులు చాలరేమో? ఏమో ఎవరు చూడొచ్చారు?

ఇంక అమెరికా వాళ్ళకైతే అన్నీ లాభాలే! వాళ్ళ ప్రజలు 'అక్కర్లేని యుద్ధాలు చేసి మా పిల్లల ప్రాణాలు తీయొద్ద'ని మౌనపోరాటాలు చేయక్కర లేదు. తల్లులు ధైర్యంగా మగపిల్లల్ని కని ఆర్మీలో కూడా చేర్పించవచ్చు ... అర్ధ రథులు, రథులు, అతిరథులు ... అంతా అయ్యాక గదా మహారథు లొచ్చేది. ఇలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిస్తే చిన్నాచితకా దేశాలు వాళ్ళల్లో వాళ్ళు కొట్టుకోవడం మానేసి బుద్ధిగా ఉంటారు. మన ధర్మం కూడా సర్వేజనా సుఖినోభవంతు అనే కదా చెప్తుంది. విశ్వశాంతి కోసం సమిధ నొక్కటి నేనూ వేశాను అని మురిసిపోవచ్చు మన పిల్లలు. నా బోటి వాళ్ళు ఆశ్చర్యపోయి ఇంత గొడవ పెట్టాల్సిన అవసరం లేదు. మన దేశంలో ఎప్పటి నుంచో ఉంది. పూర్వం రోజుల్లో కాస్త కలిగిన ఇళ్ళల్లో చిన్న పిల్లలుంటే దీపావళి పండక్కి వాళ్ళకో కుర్చీ వేసి దూరంగా కూచోబెట్టి పాలేరు కుర్రాళ్ళ చేత బాణాసంచా కాల్పించే వారుట. ఆ కుర్రాళ్ళు ఒళ్ళెరుగని సంతోషంతో కాల్చి పెట్టేవారుట. ఇప్పటికీ అమెరికాలో బాణాసంచా ఎవరు పడితే వాళ్ళు కాల్చరు. ఎవరో కాలుస్తుంటే చూసి అనందిస్తారు.

ఇన్నాళ్ళకి నాక్కూడా మంచి రోజులొచ్చినట్లున్నాయి. మా ఊళ్ళో పెద్దల గుర్తుగా మిగిలిన నాలుగెకరాలూ అమ్మి అడుగు బుడుగూ అప్పులు తీర్చాలని ఎప్పటినుంచో నా ప్రయత్నం. కానీ మా పెద్దల నాటి పాలేరు నాంచారయ్యకి అవి కొని తన పొలంలో కలుపుకోవాలని ఆశ. ఎవరికీ అమ్మనివ్వడు. తను కొనలేడు. కరణంగారు రాసిన ఉత్తరం దివ్య సందేశంలా వచ్చింది. నాంచా రయ్య నాలుగు లక్షలూ ఒక్కసారిగా ఇచ్చి ఆ పొలం తనే కొనుక్కుంటాడుట. మేం మూడు నెలల టైము ఇవ్వాలిట. నాంచారయ్య మనవలైన ఇద్దరు చిరం జీవులు త్వరలో అమెరికా వెడుతున్నారు కాబట్టి ఆ బేరం ఖాయమవుతుందనీ, మేం ఈలోగా ఎవరొచ్చి అడిగినా మాట జారకూడదనీ కరణంగారి చేత మాకు తాఖీదు జారీ చేయించాడు నాంచారయ్య.

చూశారుగా మరి! కొన్ని నిర్ణయాల వల్ల విశ్వ కళ్యాణమే గానీ ఎవరికీ ఏ ఇబ్బందీ ఉండదు. మన చేతికి బురద అంటకుండా వర్తక వాణిజ్య ఆర్థిక పారిశ్రామిక, ఆరోగ్య (ఇప్పుడు రక్షణ కూడా) రంగాలలో అతి చవగ్గా పని చేయించుకోగలగడాన్నే అవుట్ సోర్సింగ్ అంటారు ఆయా రంగాల నిపుణులు.

-నవ్య వీక్లీ, ఏప్రిల్ 2004

✦ ✦ ✦